ఎమ్మెల్సీ కవితను కలిసిన మాజీ జడ్పీటీసీ

ఎమ్మెల్సీ కవితతో ఉట్నూర్ మాజీ జడ్పీటీసీ చారులత రాథోడ్

కడెం, ఆగస్టు 29 : అక్రమ నిర్బంధం నుంచి బయటకు వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను హైదరాబాద్‌లోని వారి నివాసంలో బుధవారం ఉట్నూర్ మాజీ జడ్పీటీసీ చారులత రాథోడ్ కలిశారు. ఆమెను కలిసిన వారిలో ఇతర నాయకులు కూడా ఉన్నారు.

రుణమాఫీ పొందాలంటే సెల్ఫీ దిగాల్సిందే..

రైతు కుటుంబ సభ్యులతో సెల్ఫీ తీసుకుంటున్న ఏఈవో తిరుపతి

దస్తురాబాద్, ఆగస్టు 29 : 2 లక్షల రుణాలున్న రైతు, రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. రేషన్ కార్డు లేని రైతుల వివరాల నమోదు కార్యక్రమాన్ని గురువారం వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ఇందుకోసం గృహ సందర్శన ద్వారా రైతుల ఇంటికి వెళ్లి వ్యవసాయ శాఖ ప్రత్యేక యాప్‌లో రైతు, రైతు కుటుంబ సభ్యుల వివరాలను ఆధార్ కార్డులతో పరిశీలించి నమోదు చేశారు. రైతు, కుటుంబ సభ్యుల స్వీయ చిత్రాన్ని అప్‌లోడ్ చేశారు. ప్రస్తుతం 52 మంది రైతుల యొక్కల వివరాలను నమోదు చేసి, స్వీయ చిత్రాలను అప్‌లోడ్ చేసినట్లు ఏఈవో తిరుపతి పేర్కొన్నారు.

ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి

రుణమాఫీ చేయాలని వామపక్షాల ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట బాధిత రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, సీపీఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.జగన్‌సింగ్, సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.వెంకట్ నారాయణలు మాట్లాడుతూ.. రైతులందరికీ బేషరతుగా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంకా రాఘవులు, జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ ఆశన్న, నాయకులు లింగాల చిన్నన్న, అగ్గిమల్ల స్వామి, లంక జమున ,కోవే శకుంతల, సీపీఎంఎల్ మాస్ లైన్ నాయకులు కొడప సురేశ్, కుంరే నితీశ్, సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు దండేకర్ వామన్, గౌరాల సుభాష్ పాల్గొన్నారు. - ఎదులాపురం, ఆగస్టు 29

కనీస వేతనాలను అమలు చేయాలి

ఐకేపీ వీవోపలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న అన్నారు. గురువారం ఐకేపీ వీవోపల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నన్న మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఐకేపీ వీవోపలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలలవుతున్న పట్టించుకోవడం లేదన్నారు. ఇచ్చిన హామీ మేరకు సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలతోపాటు రూ.10 లక్షల ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ వీవోపల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్, ఉపాధ్యక్షురాలు కమల, సహాయ కార్యదర్శి తాజోద్దీన్, నాయకులు అరుణ్, ఫిరోజ్, రాజమణి, రమేశ్, అరుణ్ పాల్గొన్నారు. - ఎదులాపురం, ఆగస్టు 29

ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సెర్ప్ ఉద్యోగులు

వంటావార్పు చేసి నిరసన తెలుపుతున్న సిబ్బంది

కార్మికుల వేతనాలను చెల్లించాలి

నిర్మల్ మున్సిపల్ కార్యాయంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య, ఇతర కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం మున్సిపల్ కార్మికులు విధులను బహిష్కరించారు. గాంధీ పార్కులో వంటావార్పు చేపట్టి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగు నెలలుగా మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన చెందారు. వేతనాలు చెల్లించే వరకు విధుల్లో చేరమని స్పష్టం చేశారు. - నిర్మల్ అర్బన్, ఆగస్టు 29

క్రీడా జ్యోతిని వెలిగించి ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు, క్రీడాకారులు

ఒలింపిక్స్‌లో మెడల్స్ పెరుగుతున్నాయి

కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఎదులాపురం, ఆగస్టు 29 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడాలను ప్రోత్సహిస్తున్న కారణంగా ప్రతిసారి ఒలిపింక్స్‌లో మెడల్స్ పెరుగుతున్నాయని, క్రీడాకారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం హాకీ మంత్రికుడు ధ్యాన్‌చంద్ పుట్టిన రోజును పురస్కరించుకుని జాతీయ క్రీడల దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి పాల్గొన్న కలెక్టర్ ముందుగా ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం క్రీడాజ్యోతిని వెలిగించి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. క్రీడల్లో గెలుపొందిన ఉద్యోగులకు బహుమతులు అందించారు. జాతీయ స్థాయిలో పథకాలు సాధించిన క్రీడాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీ రెడ్డి, వయోవృద్ధుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు దేవిదాస్ దేశ్‌పాండే, బీజేపీ కౌన్సిలర్ ఆకుల ప్రవీణ్, నాయకులు యూనీస్ అక్బానీ పాల్గొన్నారు.

ఘటన స్థలం వద్ద పోలీసులతో మాట్లాడుతున్న మహిళ

రెచ్చిపోయిన చైన్ స్నాచర్స్

భైంసాలో ఒకే రోజు రెండు ఘటనలు

భైంసా, ఆగస్టు 29 : భైంసా పట్టణంలో చైన్ స్నాచర్స్ రెచ్చిపోయారు. ఒకేరోజు ఇద్దరు మహిళల మెడలో నుంచి గొలుసులను దొంగిలించడానికి యత్నించారు. ఒక మహిళ తప్పించుకోగా.. మరో మహిళ మెడలో నుంచి 24 గ్రాముల బంగారు చైనును ఎత్తుకెళ్లారు. స్థానిక మ్యాదరి గల్లిలో బీడీ కంపెనీకి రాణి నడుచుకుంటూ వెళ్తుండగా బైక్ పై వచ్చిన ఇద్దరు దుండగులు మహిళ మెడలో నుంచి చైన్ లాగేందుకు యత్నించారు. ఆమె గట్టిగా పట్టుకోవడంతో దొంగలు పారిపోయారు. కొద్ది క్షణాల వ్యవధిలో కమల థియేటర్ సమీపంలో రజిత అనే మరో మహిళ నుంచి ద్విచక్రవాహనంపై వచ్చిన దుండగులు 24 గ్రాముల చైన్‌ను లాక్కెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, ఆగస్టు 29 : గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో గణేశ్ ఉత్సవాల నిర్వహణపై ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఉత్సవ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, వివిధ శాఖల జిల్లా అధికారులతో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిర్మల్, భైంసా, ఖానాపూర్‌లలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంలో చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ అవినాశ్, మున్సిపల్ చైర్మన్ గంగ్రడ్ ఈశ్వర్, డీఎస్పీ గంగారెడ్డి పాల్గొన్నారు.

పరిమళించిన మానవత్వం

● పేదరోగికి పది లక్షలకు పైగా విలువైన వైద్యం ● తన పుట్టినరోజు కానుకగా ఉచితంగా వైద్య సహాయం అందజేత ● స్ఫూర్తిగా నిలుస్తున్న డాక్టర్ దేవేందర్‌రెడ్డి

కోలుకుని దవాఖాన నుంచి డిశ్చార్జి అవుతున్న శంకర్

డాక్టర్ దేవేందర్‌రెడ్డి

నిర్మల్, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ) : పదేళ్లుగా నిర్మల్ జిల్లా కేంద్రంలో వైద్య సేవలను అందిస్తున్న డాక్టర్ దేవేందర్ రెడ్డి.. తన మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు. ఇప్పటికే అనేక మంది పేద రోగులకు ఖరీదైన శస్త్రచికిత్సలను ఉచితంగా చేసి పలువురికి ఆదర్శంగా నిలిచిన డాక్టర్ దేవేందర్‌రెడ్డి, గురువారం తన పుట్టిన రోజు సందర్భంగా ఓ బాధితుడికి రూ.10 లక్షలకు పైగా విలువైన వైద్య సేవలను పూర్తి ఉచితంగా అందజేశారు. వివరాల్లోకి వెళితే.. నిర్మల్ పట్టణంలోని మహాలక్ష్మీవాడ ప్రాంతానికి చెందిన చొక్కాల శంకర్ నెల రోజుల క్రితం బాత్‌రూంలో జారిపడగా, కాలి కింది భాగంలో తీవ్ర గాయమైంది. దీంతో వెంటనే సమీపంలోని ఓ ఆర్ఎంపీ వద్దకు వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. వారం పది రోజులైనా గాయం మానలేదు. ఇన్‌ఫెక్షన్ పెరిగిపోతుండడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా మానకపోవడంతోపాటు ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. దీంతో తెలిసిన వారి సూచన మేరకు నిర్మల్‌లోని డాక్టర్ దేవేందర్‌రెడ్డి ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దేవేందర్‌రెడ్డి, అరుణ్‌రెడ్డి, అశ్వీర్‌రెడ్డి, క్రిటికల్‌కేర్ డాక్టర్ శ్రీనివాస్ యాదవ్‌ల బృందం శంకర్‌కు అన్ని రకాల వైద్య పరీక్షలను నిర్వహించి కాలుకు ఇన్‌ఫెక్షన్ తీవ్రంగా ఉందని, ప్రాణాలు కాపాడాలంటే కాలును పూర్తిగా తీసేయాల్సి ఉంటుందని బాధితుడి కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు మొదట శస్త్రచికిత్స నిర్వహించి మోకాలు వరకు కాలును తొలిగించారు. అయినప్పటికీ ఇన్‌ఫెక్షన్ తగ్గకపోవడంతో మరోసారి ఆపరేషన్ నిర్వహించి తుంటిభాగం వరకు తొలిగించారు. ఈ రెండు సర్జరీలు కూడా హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా వచ్చిన అపోలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కిరణ్ పర్యవేక్షణలో నిర్వహించడంతో విజయవంతంగా కాలును తొలిగించి బాధితుడి ప్రాణాలు కాపాడగలిగారు. ప్రస్తుతం శంకర్ పూర్తిగా కోలుకోవడంతో గురువారం ఆసుపత్రి నుండి డిశ్చార్జి చేశారు. నయాపైసా తీసుకోకుండా పూర్తి ఉచితంగా రెండు శస్త్ర చికిత్సలను నిర్వహించడమే కాకుండా, 15 రోజులపాటు వైద్య సేవలను ఉచితంగా అందించిన డాక్టర్ దేవేందర్‌రెడ్డికి ఈ సందర్భంగా శంకర్ కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి వచ్చిన శంకర్‌కు కార్పొరేటు స్థాయి వైద్యాన్ని పూర్తి ఉచితంగా అందించి ప్రాణాలు కాపాడామన్నారు. ఇందులో ఆయన కుటుంబ సభ్యుల సహకారం కూడా ఉందన్నారు. తన పుట్టిన రోజైన గురువారమే ఆయనను డిశ్చార్జి చేయడం సంతృప్తిని ఇచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు.


తహసీల్ ఆఫీసులో వినతిపత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

అర్హతలున్నా రుణమాఫీ కాలేదు

ఖానాపూర్, ఆగస్టు 29 : సాగుకు తీసుకున్న రుణం మాఫీ కాలేదని, రేవంత్‌రెడ్డి సర్కారుపై మండిపడుతూ గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఫకీర నాయక్‌కు నాయకులు, రైతులు వినతిపత్రం అందజేశారు. మొదటి విడుత నుంచి సరైన సమాచారం లేక అన్నదాతలు సర్వత్ర ఆందోళనతో రోడ్డెక్కుతున్నారని అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి నంది రామయ్య మాట్లాడుతూ.. రైతులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సమాధానాన్ని దాటవేస్తున్న అధికారుల తీరుపై మండిపడ్డారు. ఇప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ కొర్రీలు లేకుండా సమగ్రంగా అమలు చేయాలని, లేకపోతే ఊరుకునేది లేదని డిమాండ్ చేశారు. ఖానాపూర్, సత్తనపెల్లి పీఏసీఎస్, ఎస్‌బీఐ శాఖల ఆధ్వర్యంలో తీసుకున్న రుణాలను రైతులకు ఇబ్బందులకు గురికాకుండా మాఫీ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రైతులు అంకుశ్‌రావు, రాజన్న, ఎల్లయ్య, సుదర్శన్, గోరె బాయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యూడైస్‌లో వివరాలను నమోదు చేయాలి

నిర్మల్ అర్బన్, ఆగస్టు 29 : అన్ని పాఠశాలల ప్రగతికి యూడైస్ ప్లస్‌లోని వివరాలే ఆధారమని, షెడ్యూల్ ప్రకారం వాటిని జాగ్రత్తగా, కచ్చితమైన వివరాలను నమోదు చేయాలని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం నిర్మల్ పట్టణంలోని సెయింట్ థామస్ పాఠశాలలో విద్యాధికారులు, నోడల్ అధికారులు, మండల ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, సీసీవోలు, సీఆర్పీలతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. సెప్టెంబర్ 15వ తేదీలోపు పాఠశాలు, సౌకర్యాలు, విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ సిద్ద పద్మ, జిల్లా ప్లానింగ్ సమన్వయకర్త రాజేశ్వర్, ఏపీవో హరీశ్, జిల్లా విలీన విద్య సమన్వయకర్త ప్రవీణ్‌కుమార్, లింబాద్రి, డీఎస్‌వో వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ ప్రవేశాల గడువు పెంపు

ఎదులాపురం, ఆగస్టు 29 : రిమ్స్‌లో ఆల్ ఇండియా ఎంబీబీఎస్ కోటా ప్రవేశాల గడువును పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇది వరకు గడువు ఈనెల 29 వరకు ఉండగా ప్రస్తుతం 31వ తేదీ వరకు పొడిగించారు. ఆల్ ఇండియా కోటాలో రిమ్స్‌కు 15 సీట్లు కేటాయించారు. బుధవారం వరకు కేవలం ఐదుగురు మాత్రమే ప్రవేశాలు పొందారు. గడువు పొడిగించడంతో పూర్తి సీట్లు భర్తీ అయ్యే అవకాశం ఉందని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు.

దొంగతనాల ముఠా అరెస్టు

నలుగురు దొంగల రిమాండ్.. పరారీలో ఒకరు..

నిర్మల్ అర్బన్, ఆగస్టు 29 : నిర్మల్ జిల్లాలోని వైన్స్‌లలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను అరెస్టు చేసినట్లు నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పట్టణంలోని విశ్వనాథ్‌పేట్ కాలనీకి చెందిన రాపెన్వాడ్ రఘు, ఉత్తం పాండు పవర్, మక్కల శ్రీను, జాదవ్ దిలీప్, రాపని సోని అనే మిత్రులు రోజు సాయంత్రం వారి పనుల అనంతరం మద్యం తాగేవారు. కూలీపని ద్వారా వచ్చే డబ్బులు మద్యం, జల్సాలకు సరిపోకపోవడంతో దొంతనాలు చేయాలని నిశ్చయించుకున్నారు. మొదట పథకం ప్రకారం మయూరి హోటల్ వద్దగల శ్రీ వెంకటేశ్వర వైన్స్, సిరి వైన్స్‌లో దొంగతనం చేశారు. అదే తరహాలో మంగళవారం అర్ధరాత్రి సోఫినగర్‌లోని సాయి వైష్ణవి బార్ అండ్ రెస్టారెంట్‌లో కెమరాలు, సీసీ టీవీలను, ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి కౌంటర్‌లోని రూ.40 వేల నగదు, కంప్యూటర్, మద్యం బాటిళ్లను దొంగలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా.. దొంగతనం చేసిన 24 గంటల్లోనే ఏ1 రఘు, ఏ2 ఉత్తం పాండు రంగ పవర్, ఏ3 మక్కల శ్రీను, ఏ4 జాదవ్ దిలీప్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. రూ.2 వేల నగదును స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించారు. రాపని సోని పరారీలో ఉన్నట్లు తెలిపారు. 24 గంటల్లో దొంగలను పట్టుకున్న సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై సాయికృష్ణ, రవి, రమేశ్, సౌకత్, హోంగార్డు సతీశ్‌లను ఎస్పీ అభినందించారు.

రిమ్స్ భద్రత పటిష్టం

- ఏర్పాట్లను పరిశీలించిన ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం
- ఎలాంటి ఘటనలు జరిగినా సమాచారం ఇవ్వాలి
- అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచన
- అవుట్ పోస్టులో అదనంగా పోలీసులు

రిమ్స్ ప్రైవేటు భద్రత సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

ఆదిలాబాద్, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ) : పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా ఆర్జీ కార్ వైద్య కళాశాలలో డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదిలాబాద్ రిమ్స్ వైద్య కళాశాలలో అధికారులు భద్రతను పటిష్టం చేసేందుకు చర్యలు చేపట్టారు. రిమ్స్ వైద్యశాలతోపాటు సూపర్ స్పెషాలిటీ, మెడికల్ కళాశాలలో వైద్యులు, రెసిడెంట్ డాక్టర్లు, పీజీ విద్యార్థులు, ఎంబీబీఎస్ విద్యార్థులు కలిపి 2500 మంది వరకు ఉంటారు. విద్యార్థులు, హాస్టల్‌లో ఉంటూ విద్యను అభ్యసిస్తారు. రిమ్స్‌లో వివిధ విభాగాల్లో కూడా విద్యార్థులు విధులు నిర్వహిస్తుంటారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో వైద్యశాలలో వైద్యులు, విద్యార్థులు వైద్యసేవలు అందిస్తారు. రిమ్స్‌కు వైద్యం కోసం వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలతోపాటు మహారాష్ట్ర వాసులు వస్తుంటారు. ప్రస్తుతం వ్యాధుల సీజన్ కావడంతో కొన్ని రోజులుగా ఆసుపత్రిలో 2 వేల వరకు ఓపీ, 800 వరకు ఐపీ పేషెంట్లు చికిత్స పొందుతున్నారు.

వైద్యులు, విద్యార్థుల భద్రతకు చర్యలు

రిమ్స్ వైద్యశాలలోని వివిధ విభాగాలతోపాటు కళాశాల, హాస్టల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆసుపత్రిలో పోలీస్ అవుట్ పోస్ట్ ఉండగా 120 మంది ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది వివిధ షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తారు. వైద్యశాల, కళాశాలలో భద్రతో కోసం పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఎస్పీ గౌష్ ఆలం గురువారం రిమ్స్ భద్రత చర్యలను పరిశీలించారు. వైద్య కళాశాల, హాస్టల్ భవనాలతోపాటు, సీసీ కెమెరాల పనితీరు, ప్రైవేటు భద్రత సిబ్బంది విధులను అడిగి తెలుసుకున్నారు. ప్రైవేటు భద్రత సిబ్బందికి సూచనలు చేశారు. విద్యార్థుల భద్రతలో భాగంగా స్పెషల్ హాస్టల్ సెక్యూరిటీ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కమిటీలో పోలీసు అధికారులతోపాటు మెడికల్ కళాశాల, వైద్యశాల అధికారులు, వైద్యులు ఉంటారని తెలిపారు. మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ పెంచనున్నట్లు తెలిపారు. ఏమైన ఘటనలు జరిగినప్పుడు వైద్యులపై దాడులు, ఇతర గొడవలు జరుగకుండా ఎలా వ్యవహరించాలనే విషయంలో రిమ్స్ భద్రత సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసుపత్రిలోని పోలీస్ అవుట్‌లో సిబ్బందిని అదనంగా నియమించడంతోపాటు ల్యాండ్ ఫోన్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఘటనలు జరిగినా ప్రైవేటు భద్రత సిబ్బంది పోలీసు అవుట్‌పోస్టులో సమాచారం ఇవ్వాలని సూచించారు. వైద్యుల భద్రత కోసం పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

'స్థానిక' ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలి

● సెప్టెంబర్ 21న తుది ఓటరు జాబితా ● రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి

ఎదులాపురం, ఆగస్టు 29 : తప్పిదాలకు తావులేకుండా క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రక్రియ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి ఆదేశించారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీపీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ.. వచ్చే నాలుగైదు నెలల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ముందుగా మూడు దశలలో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని, అనంతరం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, చివరగా మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై పకడ్బందీగా దృష్టి కేంద్రీకరించాలని, జిల్లా ఎన్నికల అధికారులైన కలెక్టర్లు ఏర్పాట్లను నిశీతంగా పర్యవేక్షణ జరపాలని సూచించారు.

ప్రశాంత వాతావరణం, పారదర్శకంగా ఎన్నికలు

ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణం, పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ వంటి ప్రక్రియను తక్షణమే చేపట్టి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు. సెప్టెంబర్ 6న ఓటరు జాబితా డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వెలువరించి అభ్యంతరాలు స్వీకరించాలని, సెప్టెంబర్ 21న తుది ఓటరు జాబితాను వెలువరించాల్సి ఉంటుందన్నారు. తుది ఓటరు జాబితాను వెలువరించడానికి ముందే క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, ఏవైనా మార్పులు, చేర్పులు సంబంధించిన అభ్యర్థనలు వస్తే వాటిని పరిశీలించి ఓటరు జాబితాలో చేర్చే అధికారం కేవలం ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించేలా చూడాలని ఎన్నికల కమిషనర్ సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

వీసీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీపీవో శ్రీలత పాల్గొన్నారు.

సమాయత్తం కావాలి

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు 29 : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సమాయత్తం కావాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.